ఉష్ణోగ్రత : గరిష్ఠం 40.4 కనిష్ఠం 16.4


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:59 (గురువారం ఉదయం)




ఈసారైనా!

ఉమ్మడి జిల్లాపై వరాలు కురిసేనా?.. నేడే రాష్ట్ర బడ్జెట్

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై ఎన్నో ఆశలు
- నెరవేరని శాటిలైట్ టౌన్‌షిప్‌ల కల
- పింఛన్ల పెంపుపై గంపెడాశలు
- మెట్రో విస్తరణకు నిధులు కేటాయించేనా?
- ఫ్యూచర్‌సిటీపైనే ప్రభుత్వం ఫోకస్





రాష్ట్ర ప్రభుత్వం నేడు (బుధవారం) అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యమిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మొదటి ఏడాది పాలనలో అన్ని హామీలను నెరవేర్చని విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దశలవారీగా హామీలను నెరవేరుస్తున్నామని, ఈ ఏడాది బడ్జెట్‌లో మిగతా హామీలన్నింటికీ కేటాయింపులు చేస్తామని ప్రభుత్వం చెబుతూ వస్తోంది. దీంతో ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లోనైనా గతంలో ఇచ్చిన హామీలన్నింటికీ సర్కారు పరిష్కారం చూపుతుందని అందరూ ఆశపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం పలు పెండింగ్ సమస్యల విషయంలో అరకొర నిధులే కేటాయిస్తున్నాయి. దీంతో అనేక పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఉమ్మడి జిల్లా నుంచే వస్తున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయించే విషయంలో ప్రభుత్వాలు చిన్నచూపే చూస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీరు అందించేందుకు వైఎస్ హయాంలో గోదావరి జలాలను తరలించేందుకు చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్రవిభజన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ఈ డిజైన్ మార్చింది. ఉమ్మడి జిల్లాకు పాలమూరు- రంగారెడ్డిజిల్లా ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను తరలించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందుకు సంబంధించిన

మిగతా 7వ పేజీలో...

మెట్రో విస్తరణకు నిధులు ఎలా?



నగర శివార్లలోని ఫ్యూచర్‌సిటీతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మేడ్చల్, శామీర్‌పేట, హయత్‌నగర్ వరకు మెట్రో రైల్ విస్తరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ కూడా విడుదల చేసింది. అయితే నిర్మాణ పనులకు నిధులు ఎలా సమకూరుస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. ఈ నిర్మాణానికి చేయూతనివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖరాసినా ఇంత వరకు అతీగతీలేదు. గత బడ్జెట్‌లో మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఇవి ఏ మూలకు సరిపోవు. ఈ బడ్జెట్‌లో సర్కార్ ఎంత నిధులు కేటాయిస్తుందనేది నేడు తేలనుంది.

గళం విప్పిన ఎమ్మెల్యేలు

ప్రభుత్వ భూములను కాపాడండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లాలో అనేక చోట్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని వెనక్కి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూములను రియల్టర్లు, దళారులు అక్రమంగా కాజేశారని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ ఎదుట సర్వే నంబర్ 300లో రెండున్నరేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే సహకారంతో 95 ఎకరాల అసైన్డ్ భూములను కొందరు రియల్టర్లు కబ్జా చేశారని, వాటి విలువ రూ.200 కోట్లు ఉంటుందని ఆయన ప్రస్తావించారు. దీనిపై అప్పట్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఏం మాట్లాడలేదన్నారు. 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా తప్పుడు రికార్డులతో కొందరు కాజేశారని, వాటిపై కూడా విచారణ చేసి వెనక్కి తీసుకురావాలన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చే ఆదాయాన్ని జిల్లా అభివృద్ధికి ఖర్చు చేయకుండా అప్పటి మంత్రులు ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని ఆయన ఆరోపించారు. కాగా తుర్కయాంజల్ మాసాబ్ చెరువు గత ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైందని ఆరోపించారు. చెరువు మధ్య నుంచే మట్టిపోసి రోడ్డు వేశారని తెలిపారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి తెలిపినట్లు అన్యాక్రాంతమైన భూములపై విచారణ చేయిస్తామన్నారు. అలాగే మాసాబ్ చెరువు ఆక్రమణలు నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

దశాబ్దాలుగా ఎదురుచూశా..

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మెల్యే యాదయ్య హర్షం



చేవెళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎదురు చూస్తున్నానని, దీనికి శాసనసభ, శాసనమండలి ఒకేసారి ఆమోదం తెలపడం సంతోషంగా ఉందని మంగళవారం అసెంబ్లీలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమిమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నాలుగు సిఫారసులు చేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 59 ఎస్సీ కులాలను మూడు విభాగాలు వర్గీకరించింది. ఇందులో ఉద్యోగాల భర్తీ, విధానం, రోస్టర్ పాయింట్ల విభజన ఉన్నాయన్నారు. మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఫిబ్రవరి 4 తేదీని తెలంగాణ సోషల్ జస్టిజ్ రోజుగా అన్నివర్గాల ప్రజలు జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనేక మంది అనుమానాలను పటాపంచలు చేస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, జాతి నాయకుడు మంత్రి దామోదర రాజానర్సింహ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

మా భూముల జోలికి రావొద్దు

ఆర్డీవో, తహసీల్దార్లకు మొండిగౌరెల్లి రైతుల వినతి



తహసీల్దారు అయ్యప్పకు వినతిపత్రమందిస్తున్న రైతులు

యాచారం/ఇబ్రహీంపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసుకొని బతికే తమకు పారిశ్రామిక పార్కులు వద్దని యాచారం మండలం మొండిగౌరెల్లి రైతులు స్పష్టం చేశారు. పంటలు పండించే భూముల జోలికి వస్తే మాత్రం ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. మంగళవారం గ్రామ రైతులంతా గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సమావేశమయ్యారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి, యాచారం తహసీల్దారు టి.అయ్యప్పలకు పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూసేకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ రైతులు వినతి పత్రాలందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, యాదయ్య, బిక్షపతి రైతులు పాల్గొన్నారు.

బాలాజీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

షాద్‌నగర్‌రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని వైద్యాధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చాతాండకు చెందిన సామ్యా నాయక్ వైద్యం వికటించి ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. దీనికి స్పందించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఆసుపత్రిని సందర్శించారు. మృతుడికి అందించిన వైద్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ అడ్మిషన్ రిజిష్టర్ జిరాక్స్ కేసెట్ జిరాక్స్, ల్యాబ్ రిపోర్ట్ తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు. సమగ్ర రిపోర్టును ఉన్నతాధికారులకు అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాసులున్నారు.

ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్ అర్బన్ : ఆర్ఎంపీ ముసుగులో మల్టీస్పెషాలిటీ పేరుతో నడిపిస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఐఎంఏ షాద్‌నగర్‌శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎంఏ షాద్‌నగర్‌శాఖ అధ్యక్షుడు డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్, కోశాధికారి డాక్టర్ ప్రతాప్‌కుమార్‌లు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ప్రాథమిక చికిత్సలు చేయాల్సిన ధన్వంతరీలు షాద్‌నగర్ పట్టణంలో సైతం మల్టిస్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేసి వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఆర్ఎంపీలు నడిపిస్తున్న ఆసుపత్రులపై విచారణ చేసి, అర్హత లేకుండా వైద్యం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విదేశీ మోజు.. పిడికిలిలో ప్రాణాలు!



పది నెలల వ్యవధిలో నలుగురి మృత్యువాత

- వివిధ ఘటనల్లో భారతీయుల మృతి
- తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన
- మృతదేహాల తరలింపులో తీవ్ర జాప్యం
- రోజుల తరబడి కుటుంబాల్లో శోకం



రంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మా వాళ్లు విదేశాలలో ఉన్నారు.. మా అబ్బాయి బయట దేశంలో ఉద్యోగం చేస్తున్నాడు.. మా కూతురు అగ్రరాజ్యం అమెరికాలో ఉందని వారి తల్లిదండ్రులు సంతోషంగా చెప్పుకుంటుంటారు. కానీ ప్రస్తుతం విదేశాల్లో జరుగుతున్న సంఘటనలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. ఇటీవలి వరుస మరణాలే ఇందుకు కారణం. ఒక్క షాద్‌నగర్ నియోజకవర్గంలోనే 10 నెలల వ్యవధిలో విదేశాల్లో ఉండే నలుగురు మృత్యువాత పడ్డారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. విదేశాలకు వెళ్లి బంగారు భవిష్యత్‌ను అందుకుంటారనుకున్న పిల్లల ఆయుష్షు అర్ధంతరంగా ముగుస్తుండటంతో వారి తల్లిదండ్రులకు తీరని శోకంలోకి నెట్టేస్తుంది.

తల్లిని అనాథను చేసి..

ఒక్కగానొక్క కొడుకు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న కన్నతల్లిని వీడి కనిపించని లోకాలకు వెళ్లిపోయిన యువకుడి కథ ఇది. షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలనీలో నివాసం ఉంటున్న ఉషారాణి కొన్ని సంవత్సరాల క్రితమే భర్త అరటి కృష్ణను కోల్పోయింది. ఉన్న కొడుకు అరవింద్‌ని కంటికిరెప్పలా కాపాడుకుంటూ పెంచింది. అతని కోరిక మేరకు నానా ఇబ్బందులు పడి ఉన్నత ఉద్యోగం కోసం ఆస్ట్రేలియాకు పంపించింది. అక్కడ ఉద్యోగం చేస్తూ గత ఏడాది మే 19న అదృశ్యమయ్యాడు. చివరికి ఐదో రోజుల తర్వాత అనుమానాస్పద స్థితిలో మే 24న సముద్రపు ఒడ్డున శవమై కనిపించాడు. ఇతని మరణం ఆ తల్లి జీవితంలో తీరని విషాదం నింపింది. అరవింద్ మరణం ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. ఈ విషాదం విదేశాల్లో పిల్లలు ఉన్న తల్లిదండ్రులను ఉలిక్కిపడేలా చేసింది.

ఉన్నత చదువులకు వెళ్లి..

ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అగంతకుల చేతిలో ప్రాణాలొదిలిన యువకుడి ఉదంతమిది. కేశంపేట మండల కేంద్రానికి చెందిన వ్యాపారి గంప రాఘవులు రమాదేవిల కుమారుడు ప్రవీణ్ ఎంఎస్ చదివేందుకు అమెరికాకు వెళ్లాడు. నిత్యం ఫోను ద్వారా కొడుకు మాటలు విని మురిసిపోయే తల్లిదండ్రులు ఈనెల 2వ తేదీన మాత్రం ఓ విషాదకరమైన వార్త వినాల్సి వచ్చింది. అమెరికాలో ప్రవీణ్ పనిచేసే స్టోర్‌లో కొందరు దుండగులు కాల్పులు జరిపారు. వారి తుపాకుల బుల్లెట్లకు ప్రవీణ్ మృతిచెందాడు. దీంతో ఆ యువకుడి కుటుంబానికి పుట్టెడు శోకాన్ని మిగిల్చింది.

పాపం తల్లీకొడుకులు..

సంతోషంగా కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకులు రోడ్డు ప్రమాదంలో కన్ను మూసిన సంఘటన ఈ నెల 16న అమెరికాలోని ఫ్లోరిడాలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మృత్యువాత పడిన ముగ్గురిలో తల్లి, కుమారుడు ప్రగతిరెడ్డి, అర్విన్‌లు కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి కూతురు, మనవడు. ఈ ప్రమాదంలో మరణించిన ప్రగతిరెడ్డి అత్త సునీత సిద్దిపేట జిల్లాకు చెందిన మహిళ కావడం గమనార్హం. ఈ సంఘటన కొందుర్గు మండలంలో విషాదాన్ని నింపింది. ఈ వరుస సంఘటనలు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసున్నాయి.

మృతదేహాల కోసం ఎదురుచూపు

విదేశాల్లో ఉన్న భారతీయులు మరణిస్తే ఇక్కడి కుటుంబాల్లో రోజుల కొద్ది విషాదాన్ని అనుభవించాల్సి వస్తుంది. విదేశాల్లో మరణించిన మృతదేహాలను ఇక్కడికి తరలించడంలో తీవ్ర జాప్యమే ఇందుకు కారణం. కేశంపేటకు చెందిన గంప ప్రవీణ్ మృతదేహం స్వగ్రామానికి రావడానికి వారం రోజులు పట్టింది. అంతకుముందు అరవింద్ మృతదేహం కూడా 10 రోజుల తర్వాత ఇక్కడికి చేరుకుంది. ఇలాంటి సమస్య ఉంటుందన్న ఉద్దేశంతోనే ప్రగతిరెడ్డి, ఆమె అత్త, కుమారుడు మృతదేహాలకు ఫ్లోరిడాలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ సునీత

రంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవని షాద్‌నగర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆస్తి పన్ను చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసినా కొందరు వ్యాపారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ సిబ్బంది వ్యాపారులను స్వయంగా కలిసినా పన్ను చెల్లింపు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పన్ను చెల్లింపులో మొండిగా వ్యవహరిస్తున్న పలు వ్యాపార సంస్థలను సీజ్ చేశామన్నారు. నోటీసులు అందుకున్నవారంతా వెంటనే ఆస్తి పన్ను చెల్లించాలని, లేదంటే వారి దుకాణాలను కూడా సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి : కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సెంటర్‌లో ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 249 పరీక్ష కేంద్రాల్లో 51,766 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షాకేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.


అభివృద్ధి పనులపై చర్చించిన 'కడా' ప్రత్యేకాధికారి

దౌల్తాబాద్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాంకి, దేశాయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పర్యటించారు. నాయకులతో కలిసి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. పనులపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఆయనతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకట్రావ్, నాయకులు, స్థానికులు ఉన్నారు.



పనులపై స్థానికులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్ ఆర్టీసీ డిపోకు 16 బస్సుల కేటాయింపు : స్పీకర్ ప్రసాద్‌కుమార్



వికారాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీసీ డిపోకు కొత్తగా 16 బస్సులను కేటాయించామని అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మహిళల ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిన నేపథ్యంలో అదనపు బస్సులను కేటాయించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరగా 16 కొత్త బస్సులను మంజూరు చేశారని తెలిపారు. మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు స్పీకర్ పేర్కొన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరుగా నమోదవడం అనేది నిరంతర ప్రక్రియ అని, 18ఏళ్లు నిండిన వారు, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కందుకూరు ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నియోజకవర్గ ఎన్నికల సంఘం డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌తో కలిసి ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,67,417మంది మంది ఓటర్లున్నట్టు చెప్పారు. ఓటరుగా నమోదయ్యేందుకు 18ఏళ్లు నిండిన ప్రతీ భారత పౌరుడు అర్హుడేనన్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరం మేరకు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, చనిపోయిన వారి, డబుల్ ఓట్లను తొలగించాలని నాయకులు ఆర్డీవోను కోరారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో సంస్కరణలు



తాండూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ప్రీ ఫైనల్స్ ముగియడంతో యాన్యువల్ ఎగ్జామ్‌కు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. సెకండరీ విద్యా బోర్డు ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్ష విధానంలో కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు సెకండరీ బోర్డు పరీక్షలు కొనసాగుతాయి.

24 పేజీలతో జవాబు పత్రాల బుక్‌లెట్

ఇప్పటి వరకు జవాబులు రాసేందుకు విడిగా పత్రాలు ఇచ్చేవారు. ఈ సారి నుంచి ఆన్సర్లు రాసేందుకు 24పేజీల బుక్‌లెట్‌ను ప్రభుత్వం ఇస్తుంది. దీంతో అడిషనల్ ఆన్సర్ షీట్లు తీసుకునే అవసరం ఉండదు. అలాగే ఎగ్జామ్ సెంటర్లలోకి రిస్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను నిషేధించిన నేపథ్యంలో పరీక్ష సమయంలో టైంను తెలుసుకునేందుకు హాల్/రూమ్‌లో గోడ గడియరాలు పెడతారు. ఓఎంఆర్ బార్ కోడింగ్ విధానాన్ని అన్ని పేపర్లకు అమలు చేస్తారు. అన్సర్ బుక్‌లెట్లో విద్యార్థి వివరాలన్నీ బార్ కోడింగ్‌తో ఫిలప్ చేయిస్తారు. విద్యార్థులు ఎక్కడా నేలపై కూర్చొని పరీక్ష రాయకుండా ప్రతీ సెంటర్లో డెస్కులు/బెంచీలు తప్పక ఏర్పాటు చేస్తారు. వాటిని సమకూర్చే పనిలో ఎంఈవోలు ఉన్నారు.

లబ్ధిదారులకు పొజిషన్ చూపకుంటే ఆక్రమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి):నాగన్‌పల్లి పరిధిలో రామోజీ ఫిలింసిటీ వద్ద పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు వెంటనే పొజిషన్ చూపకుంటే పేదలతో కలిసి భూమిని ఆక్రమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. మంగళవారం రాయపోల్‌లో ఇళ్ల పట్టాదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2007లో ప్రభుత్వం నాగన్‌పల్లి, పొల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన 570 మందికి ఇళ్ల పట్టాలివ్వగా ఆ భూముల్లోకి వెళ్లకుండా ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందన్నారు. రెవెన్యూ, జిల్లా అధికారులకు ఎన్ని వినతిపత్రాలిచ్చినా స్పందన లేదన్నారు. మరో వారంలో పొజిషన్ చూపకుంటే పేదలతో కలిసి స్థలాలను ఆక్రమిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామోజీ ఫిలింసిటీ ఇళ్ల స్థలాల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పంది జగన్, కో-కన్వీనర్ బుగ్గ రాములు, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సీపీఎం నాయకు లు బి.సామేల్, జంగయ్య, నర్సింహ, విజయ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

యాచారం: ఫార్మాసిటీకి వందలాది ఎకరాల భూములు తీసుకోవడం దారుణం అని, రైతులను ఆదుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. యాచారం మండల సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్దల్లో రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న మేడిపల్లిలో జరిగే సభలో సీపీఎం జాతీయ నాయకుడు తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని, 28న కలెక్టరేట్ వద్ద జరిగే సభలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొంటారన్నారు. మొండిగౌరెల్లిలో 821ఎకరాలకుపైగా సేకరించేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహ, బ్రహ్మయ్య, అంజయ్య, ధావునాయక్, జంగయ్య, జగన్, చందు

బీసీ రిజర్వేషన్ బిల్లు సాహసోపేత నిర్ణయం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బీసీ డిక్లరేషన్‌ను ఆమోదించడం సాహసోపేత నిర్ణయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కామారెడ్డి సభలో కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను రెడ్డి సామాజికవర్గ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేయడం చారిత్రక నిర్ణయమన్నారు. డిక్లరేషన్ చట్టబద్ధతకు పార్లమెంట్‌లో బీజేపీ సహకరిస్తుందని శంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు జనాభాలో 2శాతం ఉన్న వారు దేశాన్ని, 7శాతం ఉన్న వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, 0.5శాతం ఉన్న వారు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలి బీసీలకు చిన్న చిన్న పదవులు, పథకాల ఆశ చూపి అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు.బీసీల్లోని చాలా సంచార జాతులు నేటికీ గూడు, ఊరు లేకుండా వలస బతుకు బతుకు తున్నారని అన్నారు. బీసీ డిక్లరేషన్ అమలుకు ఏమైనా అవాంతరాలెదురైతే తమిళనాడు తరహాలో షెడ్యూల్ 9లో చేర్చి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. డిక్లరేషన్‌ను ఆమోదింపజేసిన ముఖ్యమంత్రికి, మంత్రి ప్రభాకర్‌కు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ప్రాధాన్యం

నియోజకవర్గంలో సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రాధాన్యానిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీలో రిజర్వాయర్ అవశ్యకతపై వివరించి నిధులు సాధిస్తానన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి శివారులో ఏర్పాటు చేసిన గణీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్ర అభివృద్ధి, చటాన్‌పల్లి రైల్వే గేటుపై ఆర్వోబీ నిర్మాణం, పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాలు, కాలుష్యకారక పరిశ్రమలపై చర్య తీసుకునే అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు.

అర్హులందరికీ 'రాజీవ్ యువ వికాసం'

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యంగా రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపజేస్తామని శంకర్ తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశాలను నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. యూనిట్ బేస్డ్‌గా ప్రతీ లబ్ధిదారుకు రూ.50వేల నుంచి 4లక్షల రుణం ఇస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఐదు నుంచి ఆరు వేల మందికి యువ వికాస పథకాన్ని వర్తింపజేస్తామని, మీ-సేవల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

షాద్‌నగర్ డిపోకు 18కొత్త బస్సులు

షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు 18 కొత్త బస్సులను తెస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. డిపో పరిధి ప్రతీ గ్రామానికి బస్సు సర్వీసు కల్పించాలని గతంలో 18 బస్సులను తెచ్చామని, ఇప్పుడు అదనంగా 18బస్సులను తెచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. షాద్‌నగర్ డిపోకు కావాల్సిన బస్సులు వచ్చాయని, త్వరలో డ్రైవర్, కండక్టర్ల నియామకాలను చేపట్టి, సిబ్బంది సమస్యనూ పరిష్కస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, దామోదర్‌రెడ్డి, రఘునాయక్, జి.బాల్‌రాజ్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, సుదర్శన్ గౌడ్, నర్సింహయాదవ్, హరినాథ్‌రెడ్డి, కె.చెన్నయ్య, బస్వం, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, ఖదీర్, సురేందర్, అశోక్, శ్రీధర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

బొంరాస్‌పేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి సైకాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్, రాజేశ్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా శ్రద్ధతో చదువుతూ మంచి మార్కులు సాధించాలన్నారు. ఏకాగ్రతతో ఇష్టపడి చదివితే విజయాలు సాధించొచ్చని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారని రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, ఇంజనీరింగ్, ఐటీఐ కాలేజీలు, స్కిల్ సెంటర్ మంజూరయ్యాయని చెప్పారు. డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ఏకాగ్రతతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గిరిజన మహిళల వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజలకు వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షాల నాయకులు

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయం మేరకు పాలకులు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫ్యూచర్‌సిటీ అథారిటీ పేరుతో ఏడు మండలాల్లో కొన్ని గ్రామాలను విడదీయడం సరికాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం తొమ్మిది పంచాయతీల అఖిల పక్షాల నాయకులు నాగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి గ్రామాలను ఫ్యూచర్‌సిటీ అథారిటీలో ఉంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వినతిపత్రమిచ్చారు. ఫ్యూచర్‌సిటీ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కందుకూరు మండలంలోని 26 పంచాయతీలను అథారిటీలో చేర్చారని, అయితే నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళినగర్, పెద్దమ్మతండా, దావుత్‌గూడతండా పంచాయతీలను అథారిటీలో కలపలేదన్నారు. ఫ్యూచర్‌సిటీ పరిధి అన్ని మండలా గ్రామాలన్నింటినీ అథారిటీలో కలిపాలని సబిత అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు కాసు రామక్రిష్ణారెడ్డి, యాలాల శ్రీనివాస్, బుడ్డీరవు శ్రీనివాస్, ఎస్.బాల్‌రెడ్డి, ఎ.కుమార్, దామోదర్‌గౌడ్, పాండు, ఎగిరిశెట్టి నరేశ్, వెంకటయ్య,కొంతం లింగారెడ్డి, రూప్‌చందర్, రాకేష్‌గౌడ్, ఢిల్లీ శ్రీధర్, సురేష్, కె.వెంకటేశ్, బావిరెడ్డి, ఎస్.వెంకటేశ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, గణేశ్, మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాలన్నింటినీ ఫ్యూచర్ సిటీలో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రఘుపతి

మహేశ్వరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందిస్తున్న ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలనూ విలీనం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మహేశ్వరంలోని కర్నాటీ కళాభవన్‌లో వారు సమావేశమయ్యారు. ఫ్యూచర్‌సిటీ ఉద్యమ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు, ఎయిర్‌పోర్టుకు, ఫ్యూచర్‌సిటీకి సమీపంలో ఉన్న మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలనాన్నారు. తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్‌లను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో కలిపినట్టు ప్రభుత్వం ప్రకటించిదని, మరి మిగతా గ్రామాల సంగతేందని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్‌లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మహేశ్వరానికి దేశ వ్యాప్తంగా పారిశ్రామిక, ఇతర రంగాల్లో పేరున్నా మారుమూల గ్రామంగానే ఉందన్నారు. మహేశ్వరం నుంచి రోజుకో ప్రభుత్వ కార్యాలయం వేరేచోటకు తరలుతోందన్నారు. ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరాన్ని విలీనం చేస్తేనే ప్రగతి సాధ్యం అన్నారు. లేదంటే అఖిలపక్షాల కార్యాచరణ మరింత ఉధృతం చేస్తూ ముందుకు వెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మల్లేష్‌యాదవ్, కర్నాటి మనోహర్, కె.జంగయ్యయాదవ్, కాకి ఈశ్వర్, టి.యాదీష్, కంది రమేష్, నర్సింహయాదవ్, యాదయ్యగౌడ్, ఆంజనేయులు, రవి, శివ, సురేష్, దత్తునాయక్, దేశ్యా, సుదర్శన్, శ్రావణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం బీసీల పక్షపాతి

పరిగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని బీసీ సం క్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడతో మంగళవారం పరిగిలోని రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు ముదిరాజ్, నాయకులు పి.చిన్ననర్సింహులు, ఆనంద్‌గౌడ్, ఆంజనేయులు, జింకల యాదయ్య, అక్బర్‌సేఠ్, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మార్కెట్ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మగోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కార్యాలయంలో మంగళవారం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎండీ.రియాజ్ చైర్‌పర్సన్‌ను, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, యాదిరెడ్డి, సుశీల, శ్రీహరి, మల్లేశం, సర్తాజ్, కిషన్, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సంతోష్‌లతో ప్రమాణం చేయించారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి పాలకవర్గం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు ప్రకాశ్, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, గోపాల్, పాండురంగారెడ్డి ఉన్నారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'తీరని అన్యాయం చేసిన ఎమ్మెల్యే'

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి తన సతీమణి సునందకు ఇవ్వకుండా ఎమ్మెల్యే యాదయ్య తనకు తీరని అన్యాయం చేశారని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన స్వగ్రామం కొండకల్‌లోని భూముల విషయంలో రైతుల కోసం తాను పోరాటం చేయడం వల్లే పదవి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూడా కొండకల్‌తండాకు వెళ్లి రైతుల దీక్షలో పాల్గొంటే తప్పు లేదా? అని ప్రశ్నించారు. తన కుటుంబీకులు, కార్యకర్తలతో చర్చించి పార్టీలో ఉండాలా? లేదా అనేది నిర్ణయించుకుంటానన్నారు. నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి ఏఎంసీ డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, యాదిరెడ్డి, కిషన్‌నాయక్, సుశీల పాల్గొన్నారు.

విద్యార్థులు భావిపౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఈవో

కొత్తూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భావి పౌరులుగా ఎదుగాలని రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు అన్నారు. కొత్తూర్‌లోని ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో అంగోర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. టెన్త్ పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

షాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సహకార సంఘం అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్ సొసైటీ ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ శేఖర్‌రెడ్డి లావాదేవీలు, గోల్డ్‌లోన్, ఎల్టీ లోన్ వివరాలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశామన్నారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్, నర్సింహులు, గోపాల్‌రెడ్డి, రాజరత్నం, దేవేందర్‌రెడ్డి, సీఈవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య, వైస్‌చైర్మన్ రవీందర్

కొత్తూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ జోలి రవీందర్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ రిసార్ట్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య హయాంలో కొత్తూర్-కుమ్మరిగూడ రోడ్డుకు రూ.32కోట్లు, కొత్తూర్-జేపీ దర్గా రోడ్డుకు రూ.18కోట్లు మంజురయ్యాయని చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే శంకర్ కుమ్మరిగూడ రోడ్డు పనులు ప్రారంభించి, కాంగ్రెస్ పాలనలోనే నిధులొచ్చాయని చెప్పడం అబద్ధం అన్నారు. పనులు ప్రారంభించిన రోడ్లనే మళ్లీమళ్లీ పనులు ప్రారంభిస్తూ మాజీ ఎమ్మెల్యేపై బురదజల్లుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీకి రుపాయి కూడా రాలేదన్నారు. తిమ్మాపూర్-చేగూర్, పెంజర్ల, జేపీ దర్గా,తీగాపూర్ గ్రామాలకు డబుల్ రోడ్లను గత ప్రభుత్వంలోనే వేశామన్నారు. 3.5కోట్లతో మున్సిపల్ ఆఫీసు కట్టామన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి అభివృద్ధి చేసి చూపాలన్నారు. వీరి పాలనలోని పనులను ప్రజలు గమనిస్తున్నారని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు ఓర్వడం లేదన్నారు. ఎవరెన్ని నిధులు తెచ్చారో.. ఎవరెంత చేశారో బహిరంగ చర్చకు తాము సిద్ధం అని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, మాధవిగోపాల్‌గౌడ్, నాయకులు రాజేందర్‌గౌడ్, శివచారి, రవి, వెంకటేశ్, శ్రవణ్, ఓంప్రకాశ్‌చారి, లక్ష్మయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఈసారైనా..!

(ఐదో పేజీ తరువాయి)

పనులు కూడా మొదలు పెట్టింది. ఈ ప్రాజెక్టు ఆరంభించి దశాబ్దం దాటినా ఉమ్మడి జిల్లాలో వీటి పనులేమీ మొదలు కాలేదు. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 2.7లక్షల ఎకరాలకు నీరందించొచ్చు. తాగునీటికి ఢోకా ఉండదు. గత బడ్జెట్‌లోనూ అరకొర నిధులే కేటాయించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అత్యంత ప్రాధాన్యమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పినా గతంలో రూ.2వేల కోట్లే కేటాయించారు. ఆ నిధులూ పూర్తిగా విడుదల కాలేదు. అలాగే పేదలకు అందిస్తున్న పెన్షన్లు రూ.4వేలకు మించి పెంచుతామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గతంలో పెన్షన్లు పెంచలేదు. ఈ సారైనా పెంపునకు నిధులిస్తారా? లేదా అనేది చూడాలి.

శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం..

నగర శివార్లలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని గత బడ్జెట్‌లో పేర్కొన్నారు. తక్కువ ధరలకే పేద, మధ్య తరగతి వర్గాలకు నివాస గృహాలు నగరం చుట్టూ నిర్మిస్తామని తెలిపారు. కానీ దీనికి సంబంధించి ఇంత వరకు పెద్దగా అడుగులు పడలేదు.

రోడ్లు, మౌలిక సదుపాయాలకు నిధులిచ్చేనా?

ప్రభుత్వం నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీ నిర్మాణ పనులకు ప్రభుత్వం దండిగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీనిపై ప్రత్యేక దృష్టిసారించిన సర్కార్ ఇటీవల అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ బడ్జెట్‌లో ఫ్యూచర్ సిటీలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, ఇతర సదుపాయాలకు నిధులు కేటాయించే పరిస్థితి కన్పిస్తోంది. రీజినల్ రింగురోడ్డు విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్రం ముందుకు వచ్చింది. దక్షిణభాగం రింగురోడ్డుపై స్పష్టత రాలేదు. గత బడ్జెట్‌లో ట్రిపుల్‌ఆర్‌కు రూ.1,525 కోట్లు కేటాయించారు. ఈ నిధులు భూసేకరణకు ఖర్చుచేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో మరింత స్పష్టతొచ్చే అవకాశం ఉంది. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు కేటాయించినా పనులు ముందుకువెళ్లలేదు. నగర శివారు ప్రాంతాలను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. రింగురోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్‌గా, రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య భాగాన్ని పెరి అర్బన్‌గా, రీజినల్ రింగురోడ్డు బయట రూరల్ జోన్‌గా విభజిస్తామన్నారు. దీంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు పెరి అర్బన్ పరిధిలోకొస్తాయి. దీంతో ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. వీటికి ఇంత వరకు కేటాయింపుల్లేవు.

సొంతింటి కల నెరవేరేనా?

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున ఇస్తామని తెలిపింది. ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500ఇళ్లు కేటాయిస్తామని గతంలో వెల్లడించింది. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఇప్పటివరకు ఇళ్లు మంజూరు కాలేదు. పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేస్తామని, అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. డబుల్ ఇళ్ల పంపిణీ చేసినా ఇంకా కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి.

మేడ్చల్ జిల్లాలో ఎన్నో పెండింగ్ సమస్యలు


మేడ్చల్ జిల్లాలో పది వేల ఎకరాల్లో రూ.450కోట్లతో ఉద్యానపంటల హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కదలిక లేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులిస్తారా? అనే ఆశతో జిల్లావాసులు ఉన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదలచేయక పనులు నిలిచిపోయాయి. జిల్లాలో 2,350 ఇళ్లు మంజూరు కాగా, 680 పూర్తయ్యాయి. నిధుల్లేకే నిలిచాయి. జిల్లాలోని 13మున్సిపాలిటీల పరిధిలో 13 సమీకృత మార్కెట్ల నిర్మాణానికి రూ.39.9 కోట్లు మంజూరు చేశారు. నిధులు పూర్తిగా విడుదల చేయక పనులు కాలేదు. పదేళ్ల కిందట ప్రారంభించిన ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు నిలిచిపోయాయి. ఘట్‌కేసర్‌లో రోడ్లు దెబ్బతిని వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంపుపై పాలకులు ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదు.

వికారాబాద్ దశ మారేనా?

రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌పై వికారాబాద్ జిల్లా ప్రజలు భారీ ఆశలే పెట్టుకున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక ప్రకటనా చేయలేదు. ఈసారైనా జిల్లా అభివృద్ధికి దోహదపడేలా నిధులు కేటాయిస్తుందనే ఆశతో ప్రజలున్నారు. కొత్త ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రకటిస్తుందా? మరమ్మతులకు నోచుకోని సాగునీటి వనరులకు నిధులిస్తుందా? పర్యాటక ప్రాంతాల, పారిశ్రామిక, ఉపాధి రంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోనుంది? అని ఆశలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వికారాబాద్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో జిల్లాకు పెద్దపీట వేయాలని కోరుతున్నారు.

కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ సమగ్రాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు.పెండింగ్‌లో ఉన్న కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీల ఏర్పాటు ప్రక్రియా కొనసాగుతోంది. మహాలక్ష్మీ వేంకటేశ్వర ఆలయాన్ని విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశారు. కొడంగల్ మీదుగా వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటుపై సీఎం దృష్టి సారించారు. కొడంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ఏర్పాటు, పనుల పర్యవేక్షణకు అధికారిని నియమించారు. ఇంత కాలం వెనుకబాటుకు గురైన కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నిరంగా ల్లో అభివృద్ధి పరచాలన్న పట్టుదలతో రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు.



ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగేనా..

వికారాబాద్ జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు, చెరువులున్నా మరమ్మతులు, ఆధునికీకరణకు నోచుకోక నిండడం లేదు. జిల్లాలో 1,179 సాగునీటి వనరులుండగా, వీటి కింద 78వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 20శాతానికైనా నీరందడం లేదు. కోట్‌పల్లి ఒక్కటే ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు. దీని కింద 9,200ఎకరాలు ఉన్నా వెయ్యి ఎకరాలకైనా నీరందడం లేదు. ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరైనా ముందుకు సాగడం లేదు. నందివాగు, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, కొంశెట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల పరిస్థితి కూడా అలాగే మారింది. మరమ్మతులకు కూడా నిధుల్లేక నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాలువల్లో పెరిగిన మొక్కలనైనా తొలగించడం లేదు. కాలువలు, తూములు, గేట్ వాల్వ్‌లకు మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కొంత భూమికైనా నీరందుతుంది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, ఆధునీకరణ పనులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరికి పర్యాటక శోభ తెచ్చేనా?

ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం ముందుకు సాగడం లేదు. అనంతగిరిని ఎకో టూరిజంగా, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజం, అడ్వెంచర్ టూరిజంగా తీర్చిదిద్దేందుకు అవకాశమున్నా పర్యాటకాభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో రూపొందించిన ప్రణాళికలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. స్వచ్ఛ దర్శన్ కింద రూ.110కోట్లతో అనంతగిరుల్లో 213ఎకరాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే పనులు కావడం లేదు. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. సింగపూర్, మలేషియా దేశాల్లో మాదిరిగా అనంతగిరి కొండలను జంగిల్ రిసార్ట్స్, బటర్‌ఫ్లై పార్క్ ఏర్పాటు, ఎడ్వంచర్ టూరిజంగా అభివృద్ధి పరిచేందుకు అవకాశాలున్నాయి.

మినీ స్టేడియానికి నోచుకోని జిల్లా కేంద్రం

వికారాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు కలగా మారింది. ఏ ఆటలు ఆడాలన్నా బ్లాక్ గ్రౌండ్ ఒక్కటే ఉంది. ధన్నారం శివారంలో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడేళ్లవుతున్నా పనులు ముందుకు సాగడం స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా స్పందన లేదు. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రకటించే ప్రభుత్వం వికారాబాద్‌లో స్టేడియం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. స్టేడియానికి అనుబంధంగా జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. వికారాబాద్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కోస్గిలోని పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లుగానే కొంపల్లిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత విద్యార్థులు కోరుతున్నారు. నాపరాతి పరిశ్రమకు పేరొందిన తాండూరులో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చినా ఇంజనీరింగ్ కళాశాలలు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ పరంగా జిల్లాలో ఇంజనీరింగ్, మైనింగ్ కళాశాలల ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం సాకారమయ్యేనా?

జిల్లాలో ఉన్నత చదువులన్నీ ఒకే గొడుగు కింద అందుబాటులోకి వచ్చేలా వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని గత 20ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు స్థానికంగా లేక విద్యార్థులు హైదరాబాద్‌కు వెళుతున్నారు. యూనివర్సిటీని ఏర్పాటుచేస్తే అన్ని కోర్సులూ జిల్లా విద్యార్థులకు అందుబాటులోకొచ్చే అవకాశం ఉంటుంది.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



చేవెళ్ల ఎంఈవో పురందాస్

చేవెళ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో పురందాస్ తెలిపారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని హెచ్చరించారు.

ఫటాఫట్

ప్రశ్న : ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జవాబు : మండల పరిధిలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. చేవెళ్ల మోడల్ స్కూల్, చేవెళ్ల ప్రభుత్వ బాలికల పాఠశాల, చేవెళ్ల ప్రభుత్వ బాలుర పాఠశాల, చేవెళ్ల సత్యసాయి పాఠశాల, ఆలూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు జరుగుతాయి.

ప్ర: ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.?

జ: ఐదు సెంటర్లలో కలిపి 1,034 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలి.

ప్ర: పరీక్ష కేంద్రల వద్ద ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

జ: పరీక్ష కేంద్రల వద్ద విద్యార్థుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, పరీక్ష గదుల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటు చేశాం.

ప్ర: పరీక్ష కేంద్రల వద్ద బందోబస్తు ఎలా?

జ: అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మొత్తం 45 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు.

మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

- ప్రాణాలు పోతున్నా పట్టని అధికారులు
- సూచిక బోర్డుల ఏర్పాటులోనూ నిర్లక్ష్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు





అంతిరెడ్డిగూడ రోడ్డులో మూలమలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు, మామిడిపల్లి రోడ్డులో అప్పారెడ్డిగూడ సమీపంలో మూలమలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయని అధికారులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై మూలమలుపులు ప్రమాదభరితంగా తయారయ్యాయి. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాలు చేపట్టినప్పుడు అధికారులు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా మలుపుల వద్ద గడ్డి, కంపచెట్లు ఏపుగా పెరగడంతో వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మూలమలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురికి గాయాలైన సంఘటనలున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు కనీసం మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. నందిగామ మండలంలో పాత జాతీయ రహదారి నుంచి మామిడిపల్లి వరకు 10 కిలోమీటర్ల దూరం ఉండగా.. అనేక మలుపులున్నాయి. అక్కడక్కడ సీ, ఎస్ ఆకారంలో ప్రమాదకరంగా మలుపులున్నాయి. ఈ రహదారి మీదుగా మామిడిపల్లి, అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మొదళ్లగూడ గ్రామాల ప్రజలు తరచూ మండల కేంద్రానికి, షాద్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా నందిగామ మండల కేంద్రం నుంచి అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ, చేగూర్ వెళ్లే దారిలో కూడా అనేక మలుపులు ఉన్నాయి. సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లతో పాటు సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి శివార్లలో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకిరువైపులా గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కంపచెట్లను తొలిగించాలి.

- కృష్ణగౌడ్, వీర్లపల్లి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మనోహర్‌రెడ్డి



చౌదరిగూడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లకు చెందిన న్యాయవాది కందూరి మనోహర్‌రెడ్డిని నియమిస్తూ రంగారెడ్డి జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి కట్టా సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ స్థాయిలో, ఉమ్మడి కొందుర్గు మండలంలో ఆయన వివిధ పదవులు నిర్వహించారు. రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సహాయమంత్రి బండి సంజయ్, ఎంపీ డీకే అరుణ తదితరులకు మనోహర్‌రెడ్డిని ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

దొంగల హల్‌చల్

- మూడు గ్రామాల్లో దోపిడీకి పాల్పడిన దుండగులు
- అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ
- రూ.24 వేల నగదు, బైక్ అపహరణ
- గాలింపు చర్యలు చేపట్టిన చేవెళ్ల పోలీసులు

చేవెళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు మూడు గ్రామాల్లో దోపిడీకి పాల్పడ్డారు. మూడు ఇండ్లలో చోరీ చేసిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి సింగప్పగూడలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. చేవెళ్ల మండల పరిధిలోని సింగప్పగూడ, న్యాలట, రామన్నగూడ గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ముఖం కనిపించకుండా మునుగువేసుకొని వీధుల వెంట తిరుగుతూ చేతిలో ఇనుపరాడ్లు పట్టుకుని హల్‌చల్ చేశారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు. అయితే, చోరీచేసే ముందు దొంగలు తెలివిగా పక్కింటివారు బయటకు రాకుండా గడియపెట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సింగప్పగూడ గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శంషాబాద్ వెళ్లాడు. తన ఇంటి తాళం పగులగొట్టి రూ.8వేల నగదు ఎత్తుకెళ్లారు. కుమ్మరి మహేందర్ కిచెన్ గదికితాళం వేసి పక్కింటిలో నిద్రిస్తుండగా.. అతడి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.6వేలు ఎత్తుకెళ్లారు. న్యాలట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ అశోక్ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. వారి ఇంటితాళం పగులగొట్టి రూ. 10వేలు ఎత్తుకెళ్లారు. అలాగే సింగప్పగూడకు చెందిన రంగారెడ్డి తన ఇంటి ముందు బైక్ పార్కు చేశాడు. ఈక్రమంలో దొంగలు బైక్‌ను తీసుకుని పారిపోతుండగా మార్గమధ్యలో రామన్నగూడ వద్దకు రాగానే బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. బైక్‌ను అక్కడే వదిలేసి రామన్నగూడకు చెందిన షఫీ బైక్‌ను ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు అర్ధరాత్రి చేవెళ్ల పోలీస్‌లకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాలకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. న్యాలట, సింగప్పగూడ, రామన్నగూడ గ్రామాల్లో మంగళవారం ఉదయం సీసీఎస్ పోలీస్‌లు, క్లూస్‌టీం వివరాలు సేకరించారు. మూడు గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. గ్రామాల్లో రాత్రివేళ గస్తీని మరింతగా పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఆటో పల్టీ.. డ్రైవర్‌కు గాయాలు

చౌదరిగూడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వీరాపూర్ నుంచి చౌదరిగూడకు వస్తున్న ఆటో బోల్తాపడి పల్టీ కొట్టిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎనగుండు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన రాజు ఆటోలో అతడి బంధువుల ఊరు పరిగి మండలం వీరాపూర్‌కు వెళ్లి తిరిగు ప్రయాణంలో వీరాపూర్‌నుంచి చౌదరిగూడ వైపు వస్తున్నాడు. మరో ముగ్గురు ఆటోలో ఉన్నారు. అయితే, ఎనగుండు సమీపంలో సడన్‌గా రాజుకు పిట్స్ రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడి పల్టీ కొట్టింది. అతడితో పాటు భీమమ్మ, చిన్నయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు అందలేదని సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలి

- మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి



విద్యార్థులతో విశాలా శ్రవణ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, టీచర్లు

కేశంపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వ బడుల్లో చదువుకునేందుకు విద్యార్థులు ముందుకు రావాలని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి అన్నారు. కొత్తపేట పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కొత్తపేటకు చెందిన బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ 10వ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపరిచే ఫైల్స్ అందజేశారు. ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, లలితమ్మ, నరేందర్, ఎఫ్ఏవో పుల్యానాయక్, తదితరులున్నారు.

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు పాఠశాలకు పోడియంను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీహెచ్ఎం సునీత, టీచర్లు కాంగ్రెస్ నాయకుడు ఏజాజ్‌అలీ తదితరులున్నారు.

తలకొండపల్లి : లక్ష్యాల సాధనకు విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెల్జాల జడ్పీహెచ్ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహమాన్, మాజీ ఎంపీటీసీలు అంబాజీ, శ్రీనివాసమూర్తి, మార్కెట్ కమిటీత డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, హెచ్ఎం నసీం సుల్తాన్, ఉపాధ్యాయులు నాయకులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : విద్యార్థులు టెన్షన్ తీసుకోవద్దని, ప్లానింగ్ ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో సుమతి సూచించారు. నందిగామ ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎంపీడీవో పాల్గొన్నారు. మాజీ జడ్పీవైస్ చైర్మన్ గణేష్, ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ నాయకులు టీచర్లు ఉన్నారు.

కడ్తాల్ : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రపంచానికే ఆదర్శమని సీఐ శివ ప్రసాద్ అన్నారు. కడ్తాల జడ్పీహెచ్ఎస్(బాలుర)లో సాంస్కృతిక సమ్మేళనం ప్రధానోపాధ్యాయుడు జంగయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్‌పర్సన్ విజయ, ఉపాధ్యాయులున్నారు.

యాచారం : ఎస్ఎఫ్ఐ నాయకులు విప్లవ్‌కుమార్ కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి రేవంత్‌రెడ్డి



సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ అసెంబ్లీలో బీసీ డిక్లరేషన్‌కు ఆమోద ముద్ర వేయించిన సీఎం రేవంత్‌రెడ్డి బడుగుల ఆశాజ్యోతిగా నిలిచారని షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మంగళవారం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

కడ్తాల్ : స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం చరిత్రాత్మకమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్య నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్‌లు అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బీసీ బిల్లు తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది నుంచి కసరత్తు చేసిందన్నారు. మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు ఉన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు.. కేసు నమోదు

చేవెళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వాహనాన్ని బీజేవైఎం నాయకులు అడ్డుకొని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎద్దులను గోషాలకు తరలించారు. సర్దార్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు మూగజీవాలను తీసుకెళ్తున్న మూడు వాహనాలను బీజేవైఎం నాయులు, ఏబీవీపీ నాయకులు చేవెళ్లలో అడ్డుకొని పోలీస్‌లకు సమాచారం అందించారు. వాహనాల్లో కిక్కిరిసి తీసుకెళ్తున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాహన యజమానులపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. పట్టుకున్న 20 ఎద్దులను నార్సింగిలోని గోషాలకు తరలించారు.

నకిలీ జర్నలిస్టులపై ఉక్కుపాదం : వీర్లపల్లి

రంగారెడ్డి అర్బన్, మార్చి 18: (ఆంధ్రజ్యోతి) నకిలీ జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని మెయిన్ స్ట్రీమ్ మీడియా ఆధ్వర్యంలో నకిలీ జర్నలిస్టులను అరికట్టాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. శంకర్ మాట్లాడుతూ మీడియా పేరిట కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేయడంతో పాటు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. జర్నలిస్టులమంటూ అక్రమాలకు పాల్పడుతున్న నకిలీ జర్నలిస్టులను ఏరివేస్తామన్నారు. మెయిన్‌స్ట్రీమ్ మీడియా ప్రతినిధులు ఎం.సత్యనారాయణ, ఖాజాపాష, లట్టుపల్లి మోహన్‌రెడ్డి, కస్తూరి రంగనాథ్, మారం చంద్రశేఖర్, రఘుగౌడ్, సరాపు రమేష్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులందరికీ ఉపాధి : సుంకిరెడ్డి



మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు/ఆదిభట్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడమే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఈనెల 25న కల్వకుర్తిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కల్వకుర్తి, ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి ఫౌండేషన్ సభ్యులు, నిరుద్యోగ యువకులు పెద్దసంఖ్యలో హాజరైనారు. నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడులో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 68 దరఖాస్తులు రాగా 52 మంది స్పాట్ సెలక్షన్ కావడం జరిగిందన్నారు. ఎంపికైన వారందరికీ వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి : ఏసీపీ



వాయిల్లకుంట తండా వాసులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారమందించాలని, మీ డబ్బుకు రెట్టింపు డబ్బు అందిస్తామని మాయమాటలు చెప్పేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగరికంచ, వాయిల్లకుంట తండాలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎండాకాలంలో ఉ క్కపోత భరించలేక ఇంటి దాబాలపై నిద్రించరాదని కోరారు. విలువైన వస్తువులు ఇంట్లో భద్రపరచరాదన్నారు. ద్విచక్రవాహనా దారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు, కార్లు ఉన్నవారు సీట్ బెల్టు ధరించాలని కోరారు. ప్రతీ వ్యక్తి ప్రమాదబీమా చేయించుకోవడం మరువరాదన్నారు. డ్రగ్స్‌కు దూరం గా ఉండాలని సూచించారు. పోలీసులు తండాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు పాల్గొన్నారు. కాగా, యాచారం పోలీసులు మంగళవారం సైకిళ్లపై రహదారి వెంట వెళుతున్న జనంతో పాటు పలువురు గ్రామీణులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కనుల పండువగా శివరామాంజనేయ ఆలయ వార్షికోత్సవం



యజ్ఞం నిర్వహిస్తున్న గ్రామస్థులు

చౌదరిగూడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని గంగన్న గూడలో శివరామాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మొదటి రోజు స్వామి వారికి గణపతిపూజ, అభిషేకం, పుణ్యాహచనం, యాగశాల ప్రవేశ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పురోహితులు భాష్యం సాయి కిరణాచార్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా దేవేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దేవేందర్ గౌడ్ దంపతులు

మహేశ్వరం, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు టి.దేవేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ శ్రీనగర్‌లోని ఆయన నివాసమైన వినోదిని భవన్‌లో వైభవంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని కీసర ఆలయంతో పాటు మహేశ్వరం మండలంలోని శ్రీ రాజరాజేశ్వరాలయం, గట్టుపల్లిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో దేవేందర్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 503 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసిన 70 మందిని శస్త్ర చికిత్సకు రెఫర్ చేశారు. వేడుకల్లో దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు



మహేశ్వరం : దీక్షలో నాయకులు

షాద్‌నగర్/చేవెళ్ల/మహేశ్వరం/తలకొండపల్లి, మార్చి 18: (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ రిలే నిరహారదీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ కోరారు. ఎస్సీ వర్గీకరణ లో మాదిగలకు 11శాతం వాటా రావాల్సిందేనని చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. చేవెళ్లలోని దీక్షలో మల్లేష్, వెంకటేశ్, శ్రీనివాస్, తదితరులున్నారు. ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల ఇన్‌చార్జి బక్కని రవి అన్నారు. రిలే దీక్షలో ప్రశాంత్, గణేష్, కృష్ణ, తదితరులున్నారు. ఎస్సీ వర్గీకరణను అనుసరించి రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను మాజీ జడ్పీటీసీ పద్మానర్సింహ ప్రారంభించారు. మెదక్‌పల్లి, చంద్రధన గ్రామాల నాయకులు దీక్షలో కూర్చున్నారు. పోతుగంటి కుమార్, నర్సింహ, శ్రీను, రాజు, శశికాంత్, మహేశ్, కృష్ణ, తదితరులున్నారు.

భూములు కోల్పోతున్నవారికి ఉపాధి కల్పించాలి



ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీవో సరిత

కొత్తూర్, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): భూములు కోల్పోతున్న తమకు ఉపాధితో పాటు, సరైన పరిహారం చెల్లించాలని రైతులు అధికారులు ఎదుట అభిప్రాయాలు వెల్లడించారు. మండల పరిధి పెంజర్ల శివారులోని సర్వేనెంబర్ 389లో 112 ఎకరాల భూమిని కొన్నేళ్లక్రితం గ్రామానికి చెందిన పలువురు రైతులకు అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసింది. అసైన్డ్ చేసిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ భూమిని టీజీఐఐసీకి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అసైన్డ్ రైతులకు పరిహారం మాత్రం అందలేదు. నష్ట పరిహారంపై షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ఆర్ సరిత ఆధ్వర్యంలో మంగళవారం పెంజర్ల గ్రామ పంచాయతీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. భూములు కోల్పోతున్న తమకు ఉపాధి కల్పించాలని, ఎకరాకు రూ.2కోట్లు చెల్లించాలని, లేకపోతే రైతులకు వేరేచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో స్పందిస్తూ భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ జంగయ్య, ఆర్ఐ సంజీవ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నేదునూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఈనెల 20వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో చేరాలనుకున్న విద్యార్థులతో పాటు 7 నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థుల దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉచిత విద్యబోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించండి

కొత్తూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన బహుళజాతి పరిశ్రమ పీఅండ్‌జీతో పాటు, హెటిరో పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ పెంజర్ల గ్రామస్తులు తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. స్థానికంగా పరిశ్రమలు ఉన్నప్పటికీ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి లభించడం లేదన్నారు. అధికారులు స్పందించి స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశాల భీమయ్య, జైపాల్, ఎర్రోళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆదిభట్ల : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడిలో భాగంగా ఆదిభట్ల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ భర్త జంగయ్య, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, శ్రీకాంత్‌లను అరెస్టుచేశారు.

మొయినాబాద్ రూరల్ : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామోయిజ్ హెచ్చరించారు. పెద్దమంగళారంలో ఆయన మంగళవారం వాటర్‌మెన్‌లతో సమావేశమయ్యారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేద్దామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. చందన్‌వెళ్లికి చెందిన చిప్పలపల్లి గోపాల్ కుమారుడు మణివర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా చందన్‌వెళ్లి ప్రాథమికోన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు.

షాబాద్ : గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ తల్లి జయమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు జయమ్మవెంకట్‌రెడ్డి, చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజామియపటేల్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, మల్లేష్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి చంద్రశేఖర్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఆమనగల్లు : నేత్ర సంరక్షణలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ చూపాలని డీడీఎంహెచ్‌వో గీత అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో డాక్టర్ శ్రీకాంత్, సుజల పదిరోజులుగా కంటి పరీక్షల్లో 350 మంది విద్యార్థులకు దృష్టి లోపం గుర్తించి అద్దాలను పంపిణీ చేశారు.

కొత్తూర్ : ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఆశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ బీసా సాయిబాబా ఆధ్వర్యంలో ఆశాలు స్థానిక పీహెచ్‌సీ ముందు ఆందోళన చేసి డాక్టర్ వినతి పత్రాన్ని అందజేశారు.

చౌదరిగూడ : కొందుర్గు మండలం టేకులపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి కుటుంబాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. మోహన్‌రెడ్డి కూతురు ప్రగతిరెడ్డి, మనవడు ఆర్విన్‌రెడ్డి సునీతలు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్సీ మంగళవారం హైదరాబాద్‌లోని కొత్తపేటలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.

రంగారెడ్డి అర్బన్ : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా తమ వంతుగా న్యాట్కో ఫార్మా పరిశ్రమ యాజమాన్యం రూ.ఐదు లక్షల విరాళం అందించింది. ఈ సందర్భంగా మంగళవారం దేవాలయ కమిటీ సభ్యులకు పరిశ్రమ ప్రతినిధులు చెక్కును అందజేశారు.

ఆమనగల్లు : రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తుందని యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులకు ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మంగళవారం నిజరూప దర్శనం, మహాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

మాడ్గుల, మార్చి 18ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఈదమ్మ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవానికి రావాల్సిందిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నా యకుడు సూదిని కొండల్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో వడ్డెర కులస్తులతో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

కష్టజీవులకు అండగా ఎర్రజెండా



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, కష్టజీవులకు అండగా ఎర్రజెండా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. మంగళవారం ఎన్కెపల్లి చౌరస్తాలో సీపీఐ జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సూదకర్‌గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, సుభాన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.